14న కాంగ్రెస్ పెండింగ్ అభ్యర్థుల ఖరారు!

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ పెండింగ్‌లో పెట్టిన మూడు లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులను 14న ఖరారు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. ఈ మూడింటిలో ఖమ్మం అత్యంత కీలకంగా మారింది. ఈ నియోజకవర్గం పరిధిలో అన్ని అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవడంతో ఎంపీ టికెట్ కోసం నేతల మధ్య పోటీ నెలకొంది. ఖమ్మం అభ్యర్థి ఖరారైతే తప్ప కరీంనగర్ విషయంలో స్పష్టత వచ్చే అవకాశం లేకపోవడంతో అధిష్ఠానం ఎటూ తేల్చుకోలేకపోతున్నది. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీ వెళ్లినప్పటికీ పార్టీ పెద్దలను కలవకుండానే హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. ఖమ్మం, కరీంనగర్ అభ్యర్థుల విషయంలో ఆయన తన అభిప్రాయాన్ని ఇప్పటికే అధిష్ఠానానికి తెలియజేయడం వల్లే పార్టీ పెద్దలను కలవలేదని తెలిసింది. 14న ఖమ్మం అభ్యర్థిని ఖరారుచేసే అవకాశం ఉందన్న సమాచారంతో మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డి లాబీయింగ్ కోసం శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో వాలిపోయినట్టు తెలిసింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను ఆయన కలుస్తారని సమాచారం. కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఖమ్మం ఎంపీ టికెట్‌ను తాను సూచించిన వ్యక్తికే ఇస్తానని అధిష్ఠానం హామీ ఇచ్చిందని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. టికెట్ ఆశిస్తున్న పారిశ్రామికవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్‌ను తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పిలిపించుకొని చర్చించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్సే

- పార్లమెంట్‌లో తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్ పార్టీయే
- రేవంత్ వద్ద లీకులు, ఫేక్ వార్తలే
- తెలంగాణకు బద్ధ వ్యతిరేకి బీజేపీ
- బీఆర్ఎస్ లేకుండా చేసే కుట్రలు
- డమ్మీలతో బీజేపీకి హస్తం మద్దతు
- మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే
- సిద్దిపేట, కరీంనగర్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో హరీశ్

కరీంనగర్‌లోని రాంనగర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, పక్కన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

సిద్దిపేట/కరీంనగర్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్సేనని, ఎంపీలుగా గులాబీ పార్టీ అభ్యర్థులు గెలిస్తే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకలు అవుతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశంలో, కరీంనగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్‌ను ఎదుర్కొనే శక్తి ఒక్క బీఆర్ఎస్‌కే ఉన్నదని తెలిపారు. ఈ రెండు పార్టీలు కలిసి బీఆర్ఎస్ లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్, మెదక్, మల్కాజిగిరి, సికింద్రాబాద్‌తోపాటు మరికొన్ని చోట్ల కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెట్టి బీజేపీకి పరోక్షంగా సహకరిస్తున్నదని విమర్శించారు. 'మొన్నటిదాకా బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయి. బడేభాయ్, చోటే భాయ్ బంధం బలపడుతున్నది. చీకటి ఒప్పందంలో భాగంగా కరీంనగర్‌లో వినోద్‌కుమార్ గెలవకుండా కాంగ్రెస్ బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టనుంది. అందుకే ఇప్పటి వరకు ఈ సీటుకు అభ్యర్థిని ప్రకటించలేదు' అని ఆరోపించారు.

కాంగ్రెస్ సర్కారుపై ప్రజలకు విసుగు

'సీఎం రేవంత్‌రెడ్డి వద్ద సరుకు లేదు. పని లేదు. అందుకే లీకులు, ఫేకు వార్తలు వ్యాప్తి చేస్తున్నడు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదే పనిజేసిండు. అధికారంలోకి వచ్చాకా అదే పని చేస్తున్నడు. బీఆర్ఎస్‌పై అక్కసు వెళ్లగక్కుతూ కాలం వెళ్లదీస్తున్నడు తప్ప, ప్రజలకు ఏం చేస్తలేడు' అని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చి నాలుగు నెలలే అయినా, ప్రజలకు విసుగు వచ్చిందని తెలిపారు. రైతులకు పుట్టెడు దుఃఖం మిగిలిందని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. 'ఎన్నికల ముందు వడ్లకు క్వింటాలుకు రూ.2,500 ఇచ్చి వడ్లు కొంటామని చెప్పారు. మరి కొంటున్నారా? బోనస్ ఎక్కడపాయె? మీ హామీలు ఎమాయ్యాయి?' అని సీఎంను ప్రశ్నించారు.

రేవంత్ తుపాకీ తెచ్చింది కరీంనగర్ సభకే

సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమంలోగానీ, ఇప్పుడు గానీ జై తెలంగాణ అని అనలేదని, కనీసం అమరుల స్థూపానికీ నివాళి అర్పించలేదని హరీశ్ విమర్శించారు. 'ఆనాడు రేవంత్‌రెడ్డి తుపాకీ పట్టుకుని కరీంనగర్ సభకు వచ్చిన విషయాన్ని ఇక్కడి ప్రజలు మర్చిపోతారా? తెలంగాణ అని అనేది ఎవ్వడురా అని అనలేదా? దురదృష్టవశాత్తు ఇలాంటి వ్యక్తి ఈ రాష్ట్రానికి సీఎం అయ్యారు' అని ఆరోపించారు. కేసీఆరే లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూర్చున్న సీటు ఆయనకు దక్కేది కాదని తెలిపారు. అంతటి నాయకుడిని పట్టుకొని రేవంత్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం ఎంతవరకు సబబు? అని ప్రశ్నించారు.

బీజేపీ సంక్షేమ వ్యతిరేకి

పేదల వ్యతిరేక, సంక్షేమ వ్యతిరేక పార్టీ బీజేపీ అని హరీశ్ ఆరోపించారు. పదేండ్లలో ఎన్నడూ తెలంగాణ అభివృద్ధికి సహకరించని పార్టీ అని మండిపడ్డారు. ఏనాడు రైతులు, ఇతర వర్గాల వారి కోసం ఆ పార్టీ మాట్లాడలేదని విమర్శించారు. అలాంటి పార్టీకి ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. అబద్ధాలు మాట్లాడటంలో బీజేపీ బడేమియా అయితే, కాంగ్రెస్ చోటేమియా అని ఎద్దేవా చేశారు. ప్రశ్నించే గొంతుకలైన వెంకట్రామిరెడ్డిని మెదక్ ఎంపీగా, వినోద్‌కుమార్‌ను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు.

పార్లమెంట్‌లో 106 సార్లు మాట్లాడా: వినోద్‌కుమార్

తాను మొదటిసారి ఎంపీగా ఉన్నప్పుడు తెలంగాణ కోసం పార్లమెంట్‌లో 32 పార్టీల మద్దతు కూడగట్టేందుకు కృషి చేశానని వినోద్‌కుమార్ గుర్తుచేశారు. రెండోసారి కరీంనగర్ ఎంపీగా గెలిచాక తెలంగాణ అభివృద్ధికి కృషి చేశానని వెల్లడించారు. 106 సార్లు పార్లమెంట్‌లో మాట్లాడానని తెలిపారు. కరీంనగర్‌కు అర్హత లేకున్నా స్మార్ట్ సిటీని సాధించానని, మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెనకు నిధులు తెచ్చానని, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ మంజూరు చేయించానని వివరించారు. బండి సంజయ్ ఒక బడి తెచ్చారా? ఒక గుడి తెచ్చారా? అని ప్రశ్నించారు. తాను ఎంపీగా గెలిస్తే రావాల్సిన నిధులను కొట్లాడి తెస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్ మరింత అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్‌లో వినోద్‌కుమార్, అసెంబ్లీలో తాను ఉండాలని, అప్పుడే డబుల్ ఇంజిన్ డోస్‌తో పట్టుదలతో పనిచేస్తామని తెలిపారు. సమావేశాల్లో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ సునీల్‌రావు, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, కరీంనగర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, కరీంనగర్ నగర పార్టీ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని వ్యతిరేకిస్తే ఈడీ, సీబీఐ దాడులా?: పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): బీజేపీని వ్యతిరేకిస్తే ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తున్నదని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థులను కేంద్ర దర్యాప్తు సంస్థలతో వేధించడం తప్ప బీజేపీ చేసింది ఏమైనా ఉన్నదా? అని ప్రశ్నించారు. తెలంగాణకు బీజేపీ ఏమి ఒరగబెట్టిందని ఓట్లు అడుగుతుందని నిలదీశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటును ప్రధాని మోదీ పార్లమెంట్ సాక్షిగా అవమానించారని, అలాంటి పార్టీకి తెలంగాణలో ఓటు అడిగే నైతికహక్కు లేదని చెప్పారు. విభజన చట్టంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని అన్నారు. కేంద్ర మంత్రిగా ఉండి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు ఏమి చేశారని ప్రశ్నించారు.

బీజేపీ వైఫల్యాలపై 14న దీక్ష

పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యాలపై ఈ నెల 14న కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో దీక్ష చేయనున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. బీజేపీ హయాంలో తెలంగాణకు చేసిందేమిటో బండి సంజయ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పొన్నం గాంధీభవన్‌వద్ద దీక్ష చెయ్: బండి సంజయ్

కథలాపూర్, ఏప్రిల్ 12: వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని నిరసిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వద్ద దీక్ష చేయాలని బీజేపీ నేత, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సవాల్ విసిరారు. శుక్రవారం ఆయన జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పదేండ్ల పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ.. ఈనెల 14న కరీంనగర్‌లో దీక్ష చేస్తానంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడంపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో స్పందించారు. మోదీ పాలనలో కరోనా సమయంలో దేశ ప్రజలందరికి ఉచితంగా వ్యాక్సిన్ ఇచ్చినందుకు దీక్ష చేస్తారా? కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రూ.12 వేల కోట్లు ఇచ్చినందుకా? 370 ఆర్టికల్‌ను రద్దుచేసి కాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేసినందుకా? పౌరసత్వ చట్టసవరణ చేసినందుకు దీక్ష చేస్తారా? దేనికి దీక్ష చేస్తారో మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పాలని డిమాండ్ చేశారు.

అభద్రతాభావంలో రేవంత్‌రెడ్డి: ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ కాంగ్రెస్‌లో, మరీ ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డికి అభద్రతాభావం కలుగుతున్నదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత చూసి కాంగ్రెస్ మాట మారుస్తున్నదని విమర్శించారు. ప్రజల వ్యతిరేకతను దారి మళ్లించేందుకు తనపై కుట్ర జరుగుతున్నదంటూ సానుభూతి పొందేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు.

గృహజ్యోతికి 'కోడ్' అడ్డంకి అబద్ధం: రచనారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): గృహజ్యోతి దరఖాస్తుల నిలిపివేతకు ఎన్నికల కోడ్ కారణమన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రచనారెడ్డి ఆరోపించారు. ఇప్పటికే కొనసాగుతున్న పథకాన్ని ఆపాల్సిన అవసరం లేదని ఆమె తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. స్టాఫ్ నర్సులకు రెండు నెలలుగా జీతాలే ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు.

ట్రైనీ కానిస్టేబుళ్లకు అందని వేతనాలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : పోలీసు కొలువుల్లో చేరి.. తొలి జీతం అందుకొనేందుకు అష్టకష్టాలు అనుభవించిన కానిస్టేబుళ్ల బాధ వర్ణనాతీతంగా ఉన్నది. ఫిబ్రవరి 14న ఎంతో ఆశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రాలు అందుకున్నా.. శిక్షణలో విజయవంతంగా పాల్గొంటున్నా.. వేతనాలు ఆలస్యం కావడంతో ట్రైనీ కానిస్టేబుళ్లు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. వీరి వేతనాలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఇంకా బడ్జెట్ రిలీజ్ చేయకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా పలు ట్రైనింగ్ కాలేజీల్లో 9,333 మందికిపైగా శిక్షణ పొందుతున్నారు.

కొత్త నర్సింగ్ ఆఫీసర్లకు త్వరలో జీతాలు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): నూతనంగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లకు త్వరలో వేతనాలు అందజేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఫిబ్రవరిలో విధుల్లో చేరిన నర్సింగ్ ఆఫీసర్లకు రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడంపై 'నమస్తే తెలంగాణ'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి వైద్యారోగ్య శాఖ స్పందించింది. డీఎంఈ విభాగంలో మొత్తం 5,600 మంది ఉద్యోగులు చేరినట్టు పేర్కొన్నది. వీరికి ఎంప్లాయీ ఐడీ, పీఆర్ఏఎన్ నంబర్ కేటాయించే ప్రక్రియ జరుగుతున్నట్టు వెల్లడించింది. త్వరలో ఈ ప్రక్రియ పూర్తి చేసి వేతనాలు అందించనున్నట్టు వెల్లడించింది.

ఉగాది దాటినా జీతం పడలే!

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు వేశాం.. సీఎం రేవంత్‌రెడ్డి మొదలు ప్రభుత్వ పెద్దలంతా చేసుకుంటున్న ప్రచారం ఇది. కానీ, ఇప్పటివరకు తమకు వేతనాలు అందలేదని తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ) ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీవీవీపీ పరిధిలో శాశ్వత, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిపి సుమారు 12,000 మంది వరకు పనిచేస్తున్నారు. వైద్యారోగ్య శాఖ పరిధిలోని డీపీహెచ్, డీఎంఈ విభాగాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు నెల ప్రారంభంలోనే వేతనాలు వేశారు. టీవీవీపీ పరిధిలోని ఉద్యోగులకు మాత్రం ఇప్పటివరకు అందలేదు. దీంతో ఉగాది పండుగనాడు కూడా పస్తులే ఉన్నామని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరో 20 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): సమ్మర్ స్పెషల్ పేరిట మరో 20 ప్రత్యేక రైళ్లు నడుపాలని దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం నిర్ణయించింది. ఈ నెల 23 నుంచి జూన్ 29 వరకు ఈ రైళ్లు నడువనున్నాయి. సికింద్రాబాద్-ముజాఫర్‌పూర్, మహబూబ్‌నగర్-గోరఖ్‌పూర్, బెంగుళూరు- ఖరగ్‌పూర్, భువనేశ్వర్- యలహంకా, హుబ్లీ-గోమతినగర్, జబల్‌పూర్-కన్యాకుమారి, సూరత్-బరంపూర్ మధ్య సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుస్తాయి.

'ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా బస్సులు'

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా బస్సులు నడుస్తున్నట్టు టీఎస్ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఆర్టీసీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. ప్రయాణికులను అవస్థలకు గురిచేస్తున్నదన్న ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నది. పండుగలు, సెలవు రోజుల్లో సర్వీసులను తగ్గిస్తుందన్న వార్తల్లో నిజం లేదని టీఎస్ఆర్టీసీ తెలిపింది. రద్దీకి అనుగుణంగా పండుగ రోజుల్లో అదనపు బస్సులను నడుపుతున్నట్టు వెల్లడించింది.

కాంగ్రెస్‌కు మాదిగలు ఓటేయొద్దు

- మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, ఏప్రిల్ 12: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మాదిగలు ఓటేయొద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 70 లక్షలకు పైగా ఉన్న మా దిగలకు ఒక్క లోక్‌సభ సీటు కేటాయించకుండా ఆ పార్టీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఈ నెల 16 వరకు వేచి చూస్తామని, ఆతర్వాత 'గోబ్యాక్ కాంగ్రెస్' నినాదం ఎత్తుకుంటామని స్పష్టం చేశారు. ఆ పార్టీపై రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు నిర్వహిస్తామని, తమతో బీసీ, మైనార్టీలు కూడా కలిసి రావాలని కోరారు. వర్గీకరణకు మద్దతు ఇవ్వని కాంగ్రెస్.. మాదిగలకు ఏదో చేస్తుందన్న నమ్మకం లేదని, పార్లమెంట్‌లో తమ గళాన్ని వినిపించేందుకు ఒక్క ఎంపీకి అవకాశం ఇవ్వనప్పుడు ఆ పార్టీకి ఎందుకు ఓట్లేయాలని ప్రశ్నించారు.

నర్రె రాజేశ్ భార్యకు చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఫొటో జర్నలిస్టులు

ఆందోళనకరస్థితిలో జర్నలిస్టుల జీవితాలు

- మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన
- బషీర్‌బాగ్‌లో ఫొటో జర్నలిస్టు రాజేశ్ సంస్మరణ సభ
- రాజేశ్ కుటుంబానికి ఫొటో జర్నలిస్టు సంఘం రూ.లక్ష అందజేత

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): వృత్తిలో సవాళ్లు, విపరీతమైన పని ఒత్తిడి, తక్కువ వేతనాలతో జర్నలిస్టుల జీవితాలు ఆందోళనకర స్థితిలోకి పడిపోతున్నాయని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం.. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేశ్ సంస్మరణ సభ నిర్వహించింది. సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్ అధ్యక్షత వహించిన ఈ సభలో శ్రీనివాస్‌రెడ్డి.. సంఘం తరపున నర్రె రాజేశ్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫొటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు కష్టనష్టాలను పట్టించుకోకుండా వారిచుట్టూ ఉన్న కఠినమైన వాస్తవ చిత్రాలను ప్రపంచం ముందు ఉంచేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. నర్రె రాజేశ్ భార్యకు పింఛన్‌తోపాటు పిల్లలకు విద్యను అందించేందుకు మీడియా అకాడమీ సాయం చేస్తుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కే ఎన్ హరి, కోశాధికారి అనిల్, జేఎన్‌జేహెచ్‌ఎస్ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్ కుమార్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మాజీ చీఫ్ ఫొటోగ్రాఫర్ ఆర్వీ కోటేశ్వరరావు, ఈనాడు చీఫ్ ఫొటోగ్రాఫర్ వసంత్, తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హృదయానంద్, ప్రధాన కార్యదర్శి వీరగోని రజినీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ ఆశించిన జవాబులే చెప్పాలా?

- సమాధానం తెలియకపోతే మౌనంగా ఉండొచ్చు
- ఆ ప్రాథమిక హక్కును రాజ్యాంగమే కల్పించింది
- సీబీఐ తీరును ఎండగట్టిన కవిత న్యాయవాదులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు దర్యాప్తులో సీబీఐ అనుసరిస్తున్న తీరును బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తరపు న్యాయవాదులు తీవ్రంగా తప్పుపట్టారు. ఈ కేసు విచారణ లేదా దర్యాప్తులో తాను ఆశించిన సమాధానాన్ని నిందితులు చెప్పాలన్న ధోరణితో సీబీఐ వ్యవహరిస్తున్నదని ఆక్షేపించారు. సీబీఐ అడిగే ప్రశ్నకు సమాధానాలు తెలియనప్పుడు ఎవరైనా తెలియదనే జవాబు చెప్తారని, అవే ప్రశ్నలను సీబీఐ తిప్పి తిప్పి మళ్లీ మళ్లీ అడిగితే మౌనంగా ఉంటారని పేర్కొంటూ.. ఈ విధంగా పిటిషనర్ కవిత చేయడం తప్పిదమన్నట్లుగా సీబీఐ వాదన ఉన్నదని అన్నారు. తీహార్ జైలులో ఈ నెల 6న కవితను సీబీఐ విచారించడం, ఆ తర్వాత అరెస్టు చేయడం అన్యాయమంటూ ఆమె తరపు న్యాయవాదులు విక్రమ్ చౌదరి, నితీశ్ రాణా, మొహిత్‌రావు శుక్రవారం వాదనలు వినిపించారు. కవితను సీబీఐ విచారించడం, అరెస్టు చేయడంపై తాము దాఖలు చేసిన రెండు పిటిషన్లపై విచారణ చేపట్టాలని కోర్టును కోరడంతో ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేపట్టారు. దీంతో కవిత తరపు న్యాయవాదులు వాదన కొనసాగిస్తూ.. రాజ్యాంగంలోని 20(3) అధికరణ పౌరులకు మౌనంగా ఉండే హక్కును కల్పించిందని, ఇది ప్రాథమిక హక్కుల్లో ఒకటని పేర్కొన్నారు. సెల్వీ-పంకజ్ బన్సర్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం పౌరులకు మౌనంగా ఉండే హక్కు ఉన్నదన్నారు. జవాబు చెప్పేవరకు ఒకే ప్రశ్నను తారుమారు చేసి తిప్పి తిప్పి గుచ్చి గుచ్చి అడిగితే ఎవరైనా తెలియదనే సమాధానం చెప్తారని అన్నారు. అదే ప్రశ్నను మళ్లీ మళ్లీ అడిగితే చివరికి మౌనంగానే ఉంటారని, తెలియని విషయం గురించి ఎవరూ తనకు తాను వ్యతిరేకంగా చెప్పుకోరని వివరించారు. పిటిషనర్ కవిత రాజ్యాంగానికి, చట్టాలకు లోబడి వ్యవహరిస్తున్నారని, ఆమె పట్ల సీబీఐ అత్యుత్సాహాన్ని చూపుతున్నదని చెప్పారు. కవితకు సీబీఐ నోటీసు ఇవ్వకుండా, కవిత తరపున వాదించే న్యాయవాదులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్రమంగా అరెస్టు చేసిందని విక్రమ్ చౌదరి తప్పుపట్టారు. కవిత వాదనలు వినకుండా ఆమెను సీబీఐ కస్టడీ ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. తీహార్ జైలులో ఉన్న కవిత సాక్షులను ప్రభావితం చేయలేరని, సాక్ష్యాధారాలను తారుమారు చేయలేరని పేర్కొంటూ.. ఆమెను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమున్నదని అన్నారు. సీఆర్‌పీసీలోని సెక్షన్ 41ఏ కింద పిటిషనర్‌కు నోటీసు జారీ చేశాక అరెస్టు చేయడం ఏమిటని, ఒక కేసులో అరెస్టయి జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న వ్యక్తిని అదే కేసులో మరో దర్యాప్తు సంస్థ ఎలా అరెస్టు చేస్తుందని ప్రశ్నించారు. కవిత అరెస్టుకు చూపుతున్న కారణాలన్నీ పాతవేనని, ఆమెను తిరిగి అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. ఎంతో జనాదరణ ఉన్న కవిత ఓ జాతీయ రాజకీయ పార్టీకి చెందిన చట్టసభ సభ్యురాలని, తెలంగాణలో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆమెను అరెస్టు చేయడం సబబు కాదని తెలిపారు.

3 రోజుల కస్టడీకి అనుమతి

విచారణ నిమిత్తం కవితను 5 రోజుల పాటు తమకు అప్పగించాలన్న సీబీఐ అభ్యర్థనను రౌస్ ఎవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. చివరికి ఆమెను 3 రోజులపాటు (ఈ నెల 14 వరకు) సీబీఐ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ కస్టడీలో కవితకు ప్రతి 45 గంటలకోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆమె ఇంటి నుంచి భోజనం, దుస్తులు, పుస్తకాలు, జపమాల తెప్పించుకునేందుకు అనుమతితోపాటు పరుపు, బెడ్‌షీట్లు, టవల్స్, పిల్లో అందజేయాలని పేర్కొన్నది. 15న ఉదయం 10 గంటలకు కవితను తిరిగి హాజరుపరచాలని ఆదేశించింది. కవితను రోజూ